క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం

అంబాజీపేట: మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తెలిపారు. సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర వలంటీర్లను ఘనంగా సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఉదయం 10.30 గంటలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


చిరతపూడిలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ నాగరాజు

అంబాజీపేట: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తే ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశం ఉంటుందని వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వైస్ ఎంపీపీ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడి శరీర దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. టోర్నీ విన్నర్స్, రన్నర్లకు షీల్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్.నవీన్, ఎల్.రమణ, ముళ్ల ప్రభుదాస్, నేతల గోపి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 3932వ ర్యాంక్


వినయ్‌వర్మ

ఆత్రేయపురం: గ్రామానికి చెందిన ముదునూరి వినయ్‌వర్మ ఆల్ ఇండియా లెవెల్‌లో జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఓపెన్ కేటగిరిలో 3932 ర్యాంక్, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 450వ ర్యాంకు సాధించాడు. దీంతో గ్రామంలో వినయ్ వర్మను పలువురు అభినందించారు. వినయ్‌వర్మ తల్లిదండ్రులు సూర్యనారాయణరాజు, పుష్ప ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చరిత్రకారుల జీవిత విశేషాలు తెలుసుకోవాలి

అంబాజీపేట: ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి చరిత్రకారుల జీవిత విశేషాలు తెలుసుకుని వాటిని ఆచరించాలని సామాజికవేత్త వీరిన గోపాలం అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గోపాలం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వచ్చే నెల సీతారామరాజు జయంతి సందర్భంగా పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: పాడిరైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు వెటర్నరీ ఏడీ ఎల్.అనిత కోరారు. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల పాటు బీమా సదుపాయం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.384, దారిద్ర్య ఎగువన ఉన్న రైతులు రూ.960 చెల్లించాలన్నారు. మేక, గొర్రె, పంది పోషకులైతే కేవలం రూ.75 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఇతర వివరాలకు సమీప పశువుల ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పశువులు మృతి చెందితే సత్వమే బాధిత రైతు సమీప ఆర్బీకేలో ఫిర్యాదు చేస్తే కేవలం 21 రోజుల్లో బీమా సొమ్ము మంజూరవుతుందన్నారు.

ప్రమాదకర ప్రదేశాలు గుర్తిస్తాం

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి సంబంధిత అధికారులకు నివేదిస్తామని మండపేట ఎంవీఐ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని జొన్నాడ నుంచి మడికి వరకూ ఉన్న జాతీయ రహదారిని పరిశీలించారు. మలుపుల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు సమగ్ర పరిశీలన జరిపుతామని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన ఉధృత అతిసార పక్షోత్సవాలు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో గత 15 రోజుల నుంచి జరుగుతున్న ఉధృత అతిసార పక్షోత్సవాలు ముగిసినట్లు వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది పర్యటించి అతిసార వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారన్నారు. అలాగే ఓఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేసి జింక్ మాత్రలను అందించామన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే సమీప ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి పీహెచ్‌సీలో చికిత్సను తీసుకోవాలని వారు సూచించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

కూరకష్టాలు


బడుగువానిలంకలో ఎండ తీవ్రతకు దెబ్బతిన్న టమాట పంట

- వేసవి తీవ్రతతో తగ్గిన దిగుబడి
- వారం రోజుల వ్యవధిలో రెట్టింపైన ధరలు

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఒక పక్క ఎండలు మండుతుంటే మరో పక్క కూరగాయల ధరలు పెరిగి వినియోగదారుడి నెత్తిన తీవ్రమైన భారం పడింది. వేసవి తీవ్రతతో పాటు గతంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో ఆ ప్రభావం కూరగాయలపై పడి రోజురోజుకూ పెరుగుతున్నాయి. మృగశిర కార్తె వచ్చినా ఎండలు తగ్గకపోవడంతో ఉష్ణోగ్రతలు పెరిగి జిల్లా వ్యాప్తంగా నదీ పరీవాహక ప్రాంతంలోని తోటలన్నీ దశల వారీగా ఎండిపోయాయి. దీంతో కూరగాయల దిగుబడి తగ్గిపోయి నానాటికి కొరత తీవ్రమవుతుంది. దీంతో వారం రోజుల వ్యవధిలోనే దాదాపు కూరగాయ ధరలు రెట్టింపు కావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ నుంచి దేశం నలుమూలలకు ఎగుమతి అయ్యే కూరగాయలు నేడు తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గంలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని 12 మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు సాగువుతున్నాయి. ఈ వేసవిలో వాతావరణ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండటంతో రైతులకు కూరగాయల సాగు ఏమాత్రం ఆశాజనకంగా లేదు. రుతుపవనాల ప్రభావం వల్ల జూన్ నెలాఖరు నాటికి వర్షాలు వచ్చినా ఆగస్టులో వరదలు సంభవించే అవకాశం ఉండటంతో కూరగాయల సాగుకు సెప్టెంబర్ నెలాఖరు వరకూ లంక రైతులు ముందుకు వచ్చే అవకాశం లేదు. మెట్ట ప్రాంతంతో పాటు, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పంట అందుబాటులోకి వస్తే ధరల్లో కొంత మేర ఉపశమనం కలిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతుంది.

ధర ఉన్నా దిగుబడి లేదు

మార్కెట్ విపణిలో కూరగాయలకు అత్యధిక ధర పలుకుతున్నా తగినంత దిగుబడి లేకపోవడంతో రైతులకు శాపంగా పరిణమించింది. ఈ ఏడాది సుదీర్ఘకాలం పాటు ఎండలు కొనసాగడంతో కూరగాయ తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనివల్ల మడికిలో అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు గతంతో సుమారు 15 టన్నుల కూరగాయలు సరఫరా కాగా ప్రస్తుతం మూడు టన్నులకే పరిమితమైంది. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడి తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎరువుల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో పాటు కూలీల కొరత ఏర్పడటం వల్ల కూరగాయల సాగు ప్రశ్నార్థకంగా మారిందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు	రూ.పాత ధర (కేజీల్లో)	రూ.కొత్త ధర (కేజీల్లో)
ఉల్లి	20	30
మిరపకాయ	30	90
అల్లం	40	80
బంగాళాదుంప	18	30
వంకాయ	20	60
బెండకాయ	20	60
బీట్‌రూట్	20	60
కాలీఫ్లవర్	10	30
చిక్కుళ్లు	60	80
అరటికాయ	05	08
దొండకాయ	20	30
టమాటా	30	60
బీరకాయ	30	80
ఆనపకాయ	10	20
క్యాప్సికమ్	40	70



సరఫరా తగ్గింది

వేసవి ప్రభావం వల్ల కూరగాయ తోటలు ఎండిపోయాయి. ఎండల ప్రభావం సుదీర్ఘంగా ఉండటంతో కూరగాయల దిగుబడులు తగ్గి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి.

– చిన్నం రాజు, కూరగాయల వ్యాపారి, కొత్తూరు



ధరలు దారుణంగా పెరిగాయి

వారం రోజుల వ్యవధిలో కూరగాయ ధరలు రెట్టింపయ్యాయి. దీనివల్ల కూరగాయలు కొనుగోలు చేయడం భారంగా మారింది. బడ్జెట్ చూసుకుని కూరగాయలు కొనే పరిస్థితి నెలకొంది.

– నిచ్చెనకోళ్ల సుబ్రహ్మణ్యం, చింతలూరు

స్వామి సన్నిధిలో జూనియర్ సివిల్ జడ్జి


జడ్జి హిమబిందుకు స్వామి చిత్రపటం ఇస్తున్న సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం రాజోలు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద జడ్జి హిమబిందుకు ఆలయ మర్యాదలతో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు జడ్జి హిమబిందు, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

చిన్నారులకు సాయం


సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన తోలేటి రేవతి, సాయికి రావులపాలేనికి చెందిన శ్రీమతి డొక్కా సీతమ్మ సేవాసమితి నిర్వాహకులు సైకిల్, నిత్యావసరాలు, పండ్లు అందజేశారు. ఈ పిల్లలకు చిన్న వయసులోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో సమాచారం తెలుసుకుని సంస్థ నిర్వాహకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సిబ్బంది, బడుగు సుబ్బయ్య, దసరా వంశీబెన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రావులపాలెం: సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన చదరంగం, చిత్రలేఖనం, భక్తి పాటలు, అష్టకములు, శ్లోకాలు, పద్య సూక్తులు, భగవద్గీత, స్టోరీ టెల్లింగ్, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న 89 మంది విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కోనసీమ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ అధికారి సత్తి వీవీ సత్యనారాయణరెడ్డి పాల్గొని చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. కోలాటంలో శిక్షణ ఇచ్చిన కొత్తపేటకు చెందిన రిటైర్డ్ డ్రిల్ మాస్టర్ మారిశెట్టి సత్యనారాయణ, చేతి రాత, డ్రాయింగ్ శిక్షణ ఇచ్చిన లొల్లకు చెందిన చిప్పాడ సత్యనారాయణ, చదరంగం శిక్షణ ఇచ్చిన రాజమహేంద్రవరానికి చెందిన సుబ్రహ్మణ్యశర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరి వివేకానంద రెడ్డి, చిర్ల వెంకట రెడ్డి, కొవ్వూరి బ్రహ్మారెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, చెక్క సూర్యప్రకాష్, వెలగల హరినారాయణరెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

పాఠశాలల్లో నిరుపయోగంగా కంప్యూటర్లు

అంబాజీపేట: శాస్త్ర సాంకేతికత ఉరకలు వేస్తున్న ప్రస్తుత తరుణంలో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందకుండా పోతుంది. గత పదేళ్లుగా కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. కంప్యూటర్ విద్య ఈ ఏడాదైనా ప్రారంభిస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో కొత్తపేట డివిజన్ వ్యాప్తంగా సుమారు 20 పాఠశాలల్లో సర్వశిక్షాభియాన్ నిధులతో ప్రారంభమైన కంప్యూటర్ బోధన అనంతరం 90 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందేది. అనంతరం నిట్ సంస్థతో 2007లో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం 2008 విద్యా సంవత్సరం నుంచి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని సుమారు 90 పాఠశాలల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే ఏర్పాటు చేశారు. దీని నిమిత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లను నియమించి ఒక్కో టీచర్‌కు రూ.2,300ల చొప్పున జీతం ఇచ్చేవారు. అయితే కంప్యూటర్ ఉపాధ్యాయుల ఒప్పందం 2013తో ముగియడంతో విద్యార్థులకు నాటి నుంచి విద్య అందడం లేదు. కంప్యూటర్‌ల అనుమతి కాలం గడచిపోవడంతో ఆ సంస్థ వారు కంప్యూటర్లను మెయింటనెన్స్ చేయక అవి అలంకార ప్రాయంగా మారాయి. దీంతో కంప్యూటర్ విద్య కాస్తా అటకెక్కింది.


అంబాజీపేటలో శిథిలమై మూలకు చేరిన కంప్యూటర్లు

యువతికి వైద్యానికి సాయం


సాయి దీపిక కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: ఊపిరితిత్తులకు సంబంధించి వ్యాధితో బాధపడుతున్న అమ్మాయికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం సాయం అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన పుట్టా సాయిదీపిక భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది. ఆమెకు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి రావడంతో రెండు ఊపిరితిత్తులు మార్చాలని హైదరాబాద్ యశోదా హాస్పిటల్ డాక్టర్లు తెలిపారు. ఈ సర్జరీకి సుమారు రూ.30 లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యులు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసమితి సభ్యులను ఆర్థికసాయం కోరారు. వారికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆపరేషన్ నిమిత్తం ఈ సాయం అందజేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.

మండుతున్న ఎండలు

- మృగశిరలోనూ తగ్గని ఉష్ణోగ్రతలు
- మజ్జిగతో ఉపశమనం
- వ్యాపార కూడళ్లు, రహదారుల్లో చలివేంద్రాలు
- దాతృత్వంతో దాహం తీరుస్తున్న దాతలు, సంస్థలు

కొత్తపేట: రాళ్లు పగిలే స్థాయి ఎండలు కాసే రోహిణీ కార్తె వెళ్లిపోయింది. వాతావరణం చల్లబడి వర్షాకాలానికి సంకేతాలిచ్చే మృగశిర కార్తె వచ్చింది. అయినా వాతావరణం చల్లబడలేదు.. సరికదా రోహిణీ కార్తెను మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటలకే సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు. జనం బయటకు వెళ్లి చక్కబెట్టుకునే పనులను వాయిదా వేసుకుని ఇళ్లకే పరిమితమవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లేవారు ఎండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉష్ణతాపానికి గురవుతున్నారు. అటువంటి వారి కోసం వివిధ స్వచ్ఛంద సంస్థలు, పలువురు వ్యక్తులు, వ్యాపార సంస్థలు మజ్జిగ చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు.


కొత్తపేట కమ్మిరెడ్డిపాలెంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్న పెద్దింటి రామం

'పెద్దింటి' ఇంట మజ్జిగ చలివేంద్రం

కొత్తపేట–వాడపాలెం రోడ్డులోని సంతోషిమాత ఆలయ అర్చకుడు పెద్దింటి రామం కమ్మిరెడ్డిపాలెంలోని తన ఇంటి వద్ద గత నెల మొదటి వారంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పౌరోహిత్యం ద్వారా వచ్చిన ఆదాయంతోనే రోజూ వంద లీటర్ల మజ్జిగతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ ఇచ్చి వారి దాహార్తిని తీరుస్తున్నారు. ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులూ చలివేంద్రం నిర్వహిస్తుండగా వారి సేవా దృక్పథాన్ని గుర్తించిన స్థానిక, స్థానికేతర దాతల సహకారం తోడయింది. రామం, ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. అలాగే స్థానిక మెయిన్ రోడ్డులో వాసవీ జ్యూయలర్స్ అధినేత కొత్త సుబ్బారావు (బుల్లియ్య) కుటుంబం ప్రత్యేకంగా మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సుమారు వంద లీటర్ల మజ్జిగ తయారుచేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. బుల్లియ్య సేవా దృక్పథాన్ని స్థానికులు అభినందించారు. స్థానిక సత్యసాయి సేవా సంస్థ, పలువురు పలుచోట్ల చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు.


కొత్తపేట మెయిన్‌రోడ్డులో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్న కొత్త బుల్లియ్య

అందుబాటులో వరి విత్తనాలు

ఆలమూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి(ఏవో) ఎస్.లక్ష్మీలావణ్య అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 23 రైతు భరోసా కేంద్రాల్లో 36 క్వింటాళ్ల స్వర్ణ (7029) ఎంటీయూ (1318) అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే రైతుల వద్ద 2390 క్వింటాళ్ల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో మండలంలో 9583 ఎకరాల్లో వరిసాగు జరుగుతుందన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా నారుమళ్లకు తొందర పడవద్దన్నారు. వర్షాలు కురిసిన వెంటనే ఖరీఫ్ పనులు ప్రారంభించాలని ఆమె సూచించారు.

మహిళ అదృశ్యంపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం పేర్చెర్ల దుర్గాదేవి ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు బీరవాలో రూ.40 వేలు తీసుకుని వెళ్లిందని ఇంటికి తిరిగి లేదని భర్త సుబ్బరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన బి.శ్రీమన్నారయణ–ఝాన్సీ దంపతులు రూ.15,116, రావులపాలేనికి చెందిన కె.నాగమణి రూ.10,116, తణుకు మండలం సజ్జాపురానికి చెందిన ఐ.శ్రీనివాసరాజు–పార్వతీ దంపతులు రూ.10,116, కాకినాడకు చెందిన కేఎస్ సంపత్ కుమార్–మాధవి దంపతులు రూ.10,116, ర్యాలి గ్రామానికి చెందిన ఎం.సత్యం–కృష్ణకుమారి దంపతులు రూ.10,116, చోడవరానికి చెందిన కె.శ్రీనివాస్–దుర్గాసుజాత రూ.10 వేల విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు. బుల్లితెర నటుడు మధుసూదన్ కుటుంబ సభ్యులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎంఈవో–2గా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

సఖినేటిపల్లి: మండల విద్యాశాఖాధికారి–2 గా మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం మద్దాలి వెంకటేశ్వరరావు ఆదివారం నియమితులయ్యారు. కాకినాడ డీఈవో కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మంజూరైన 64 ఎంఈవో–2 పోస్టులకు కౌన్సెలింగ్ చేసినట్టు ఆయన చెప్పారు. దీనిలో ఎంఈవో–2 పోస్టుకు సఖినేటిపల్లి మండలాన్ని కోరుకున్నట్టు తెలిపారు. సోమవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఇందుకు సంబంధించి బాధ్యతలు చేపట్టనున్నట్టు వెంకటేశ్వరరావు అన్నారు. ఆయనకు పలువురు సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అంబాజీపేట: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గంగలకుర్రు అగ్రహారంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు బీజేపీ విజయోత్సవ సభ

అయినవిల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఈ నెల 20న పార్టీ విజయోత్సవ సభను ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సభకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి, పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సీవీఎల్ మాధవ్, జిల్లా ప్రముఖులు రానున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొప్పనాతి శ్రీరామచంద్రమూర్తి, పార్టీ నాయకులు రాజేష్, శ్రీను, కొనికిపాటి శ్రీను తదితరులు ఉన్నారు. అనంతరం సభ ప్రాంగణంలో ఏర్పాట్లను వెంకటేశ్వరరావు పరిశీలించారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ

మామిడికుదురు: మొగలికుదురు గ్రామానికి చెందిన కనుమూరి సుబ్బరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సుబ్బరాజు చిత్రపటం వద్ద జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఆయనతో పాటు మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, జక్కంపూడి వాసు, పిల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు సుబ్బరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కానరాని రుతుపవనాలు

అంబాజీపేట: రోహిణి కార్తె దాటిపోయింది. మే నెల ముగిసింది. జూన్ నెల వచ్చేసింది. రుతు పవనాలు కేరళను తాకాయి. కానీ ఇక్కడి ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గడం లేదు. ఉదయం 8 గంటల నుంచే సూర్యప్రతాపం మొదలవుతుండటంతో మధ్యాహ్నానికి సెగలు కక్కుతున్నాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైబడుతుండటంతో నిప్పుల కొలిమిలా మారుతున్నాయి. దీంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ప్రచండభానుడి దెబ్బకు ఏసీలు కూడా ఆశించిన చల్లదనాన్ని ఇవ్వకపోవడంతో ఉక్కపోత తప్పడం లేదు. కొత్తపేట డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో తలకు టవల్స్ చుట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తుంది. అంబాజీపేటలో ఆదివారం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఓ పక్క ఎండ తీవ్రత.. మరో పక్క ఉక్కపోతతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.


అంబాజీపేటలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

30 మంది రక్తదానం

కొత్తపేట: అవిడి పీహెచ్‌సీలో ఆదివారం 30 మంది రక్తదానం చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది కల్యాణ్ దిలీప్ సుంకర పుట్టినరోజు సందర్భంగా జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు అడపా ఆనంద్, వంగూరి అంజి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ


పేదలకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న సంస్థ సభ్యులు

మండపేట: పేదలకు చేతనైనంతలో అండగా నిలవడమే లక్ష్యంగా శ్రీమోక్ష స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపకుడు ఎగ్గాడి లోవరాజు పేర్కొన్నారు. స్థానిక 20వ వార్డులో వంద మందికి పైగా పేదలకు ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ కూలి పనులు చేసుకునే కొందరు యువకులు కలిసి ఇటీవల తమ సంస్థను ప్రారంభించామన్నారు. రానురాను తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. సంస్థ సభ్యులు కర్రి వెంకటరమణ, జి సురేష్, మందపల్లి సూరిబాబు, తాతపూడి సందీప్, ఎగ్గాడి సతీష్, బొడ్డపాటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన మట్టి టిప్పర్

కాట్రేనికోన: పల్లంకుర్రు సాపేవారిపేట రోడ్డులో మోటారు సైకిల్‌ను మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెయ్యేరు అగ్రహారానికి చెందిన గిడ్డి బయ్యమ్మ తన భర్త సత్యనారాయణతో కలసి పల్లంకుర్రు శివారు నక్కావారిపేటలోని పుట్టింటికి వచ్చి తిరిగి వెళుతుండగా టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైంది. 108 అంబులెన్స్‌లో ఆమెను అమలాపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. టిప్పర్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో స్థానికులు రోడ్డుపై బైఠాయించి మట్టి పనులను అడ్డుకున్నారు. కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్ట్

మామిడికుదురు: బైక్‌లను దొంగిలించి వాటి నంబర్ ప్లేట్లతో పాటు రంగులు మార్చి విక్రయిస్తున్న ముగ్గురు దొంగల్ని అరెస్టు చేసి రాజోలు ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చామని నగరం ఎస్సై షేక్ జానీ బాషా ఆదివారం తెలిపారు. ఈ కేసులో పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన రాయి రాజు అలియాస్ డేవిడ్‌రాజు (బైక్ మెకానిక్), నాగుల్లంక శివారు గుద్దాయిలంకకు చెందిన కొనుకు నాగేంద్రరాజు (పెయింటర్), అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడు (పెయింటర్)ని అరెస్టు చేశామన్నారు. వీరికి కోర్టు ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించిందని చెప్పారు. జల్సాలకు అలవాటు పడిన ఈ ముగ్గురు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరి వద్ద నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పాశర్లపూడి, ఈదరాడ గ్రామాలకు చెందిన రెండు బైక్‌లతో పాటు రాజోలుకు చెందిన మూడు బైక్‌లు, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మరో బైక్ ఉన్నాయని ఎస్సై చెప్పారు. బైక్‌ల తనిఖీలో అనుమానాస్పదంగా కనిపించిన ఈ ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని విచారణ జరపగా దొంగతనం బయటపడిందన్నారు.